# అసలు శత్రువు

నాయకులు, పోలీసులు, ధరలు లాగే తనుకూడా యథాశక్తి ప్రజల్ని కాల్చుకుతినే సూర్యుడు వీధులన్నీ నిర్మానుష్యంగా వుండటంతో భూమాతని మాడ్చి పారేస్తున్నాడు.

కదిలే అవకాశం, హక్కులేని జనం ఇళ్లలో మగ్గి ముగ్గి పోతున్నారు.

వర్షాకాలంలో మండుటెండలు— వింత!!

పిల్లలకు పాలులేవు సరికదా, గట్టిగా ఏడ్చేహక్కు కూడా లేని పరిస్థితి. ఇళ్లలో బియ్యం, కూరలు, పప్పులూ ఏమీలేవు.

కర్ఫ్యూ!!

మతకలహాలు, మతకలహాల పేరిట దౌర్జన్యం, దోపిడీలు. హత్యలు. మూడురోజులయ్యింది లక్షలాదిజనం వీధిలోనిలబడి సూర్య దర్శనం చేసుకుని. కర్ఫ్యూ అంటే పోలీసు కాల్చిపారేస్తాడేమోననే భయం ఒకపక్క అయితే, కత్తిపోట్లకు గురిఅవుతామోననే భయం మరోపక్క. బయట ఏం జరుగుతోందో తెలియదు. వేరేపేటల్లో నివసి

స్తూన్న తోబుట్టువులు, ప్రాణస్నేహితులు ఏమయ్యారో తెలియని గందర గోళం. తిండిలేదు సరికదా, తాగేందుకు నీటిచుక్క కూడాలేని స్థితి, పోయిన కుళాయిలను బాగుచేసిన నాథుడులేడు. పేపర్ చదివి వాళ్ళైజు లయ్యింది. ఏ మాత్రం సమాచారం తెలిసినా ఒక రేడియో ద్వారానే. రేడియోలో చెవిపెట్టి, జాగ్రత్తగా వింటున్నాడు ఖాన్— 'ఒక ముఖ్య ప్రకటన'ని.

"జంటనగరాల పోలీస్ కమీషనర్ ఇలా తెలియజేస్తున్నారు. ఈ రోజు మధ్యాహ్నం రెండు గంటలనుంచి నాలుగు గంటలవరకు— అంటే రెండు గంటల పాటు—పాతబస్తీలో కర్ఫ్యూని ప్రజలు నిత్యా వసర వస్తువులు కొనుక్కునే నిమిత్తం సడలిస్తున్నారు. తిరిగి నాలుగు గంటల నుంచీ యథాప్రకారం కర్ఫ్యూ అమలులో వుంటుంది. ప్రకటన సమాప్తం".

"యాఖుదా...." ఆనందంతో ఎగిరి గంతేసాడు, అరవై సంవ త్సరాల ఖాన్.

ఆ అరుపుకి "క్యాహువా, క్యాహువా?" అంటూ ఆందోళనగా పరుగెత్తుకొచ్చింది, ఫాతిమా. తల్లిని అనుసరించి, సుల్తానా కూడా వచ్చింది, గాభరాపడుతూ.

"అరే, వో సుల్తానాకీమా! అచ్ఛీఖబర్ హై- ఆజ్ దో బజేసే .... చార్ బజే తక్.... హమ్‌కు.... ఏ ఘర్‌సె.... ఆజాదీ.... మిల్ రహీహై" అంటూ ఆనందాన్ని ముక్కలుగా తుంచి, ఒత్తిపలికి, "హమ్ బజార్‌మె ఫిరేంగే- బాహర్ నా చేంగే- దోస్తోంకూ మిలేంగే- దాల్ రోటీ లాయేంగే" చిన్నపిల్లాడిలా గెంతసాగాడు ఖాన్.

"అరె, ఏ కైసా? కర్ఫ్యూ హైనా?" అంటూ నూతి చుట్టూ చెయ్యితిప్పింది ఫాతిమా.

"అరె గోలీమారో కర్ఫ్యూకా?" అంటూ అలవోకగా నవ్వేడు ఖాన్.

తండ్రికి పిచ్చిపట్టిందా అనే అనుమానం కలిగింది సుల్తానాకి. "అరె, బాబా! క్యాబాత్‌కర్ రహేహో? కర్ఫ్యూకా గోలీ మార్నా క్యాహై?" లోనుంచి తన్నుకొస్తూన్న ఆనందాన్ని ఆశ్చర్యం అణచివేస్తూంటే, తండ్రిని కుదుపుతూ ప్రశ్నించింది.

"మేరీ ప్యారీ బేటీ! ఓ దో గంటే కర్ఫ్యూ నహీ రహతీ హై బోల్కే అభీతో రేడియోమె బోలేనాజీ" అంటూ చప్పట్లు చరిచాడు ఖాన్.

వెన్నెలసోనల్లో స్నానం చేస్తూన్నంత ఆనందం వెల్లి విరిసింది ఆ ఇంట్లో. బయటకు పోవచ్చు. హాయిగా తిరగొచ్చు. స్నేహితుల్ని కలవవచ్చు. గొడవల్లో నష్టపోయిన మిత్రుల్ని పరామర్శించవచ్చు. ఆహార పదార్థాలు కొనుక్కోవచ్చు- స్వతంత్రం వచ్చినంత ఆనందం.

అంతలోనే ఫాతిమా మొహంలో ఆందోళన, గాభరా.

"ఒజీ- తుమ్ బాహర్ జానా నహీహై" అంది మొండిగా, భర్త బయటకు వెళ్లడం సుతరామూ తనకిష్టం లేదనే భావన మొహంలో ప్రకటిస్తూ.

అదిరిపడ్డాడు ఖాన్. పోవద్దు అంటుందేవిఁటీ పిచ్చిది?

"హాఁ- నహీ జానా తుమ్. ఓ లోగ్ తుమ్‌కు జిందా నహీఛోడ్తె బతర్ నాక్ లోగ్స్ హై వో. ఇన్‌సాన్ లోగ్ నహీహోతే."

"కౌన్ లోగ్?" భ్రుకుటిముడిచి ప్రశ్నించాడు ఖాన్.

"ఓహీ హిందూ జాన్‌వర్ లోగ్- హమారే దుష్మన్!" హిందు పంటే ఆమెకున్న అసహ్యం ఆమె పలికిన తీరులోనే ధ్వనించింది.

తేలికగా నిశ్వసించినవ్వాడు ఖాన్. ఎవరు హిందువు? ఎవరు ముస్లిం? రాక్షసత్వం ప్రబలితే అందరూ ఒక్కటే. "మేరీ ప్యారీ

ఫాతిమా" అంటూ అతనేదో నచ్చ చెపుతూండగానే మధ్యలో అందు కుని, "తుమ్ ముఝే కుచ్ నహీ బోల్నా. మై బోలీ తుమ్ నహీ జానా బస్" అంది ఫాతిమా మొండిగా, చెవులు చేతుల్తో కప్పుకుంటూ. భర్త మీద ప్రేమ ఆమె ముఖంలో పరిస్ఫుటంగా కనిపిస్తూంది.

బిక్క చచ్చిపోయాడు ఖాన్.

బయటకు వెళ్లకపోతే ఎలా? ఇంట్లో తిండానికేమీలేదు. ఈ కర్ఫ్యూ ఎప్పటికి పోతుందో తెలియదు. ముగ్గురూ పస్తులు పడుకోవాలి.

"బాబా! మై అమ్మీకూ సముఝాతీహూఁ. తుమ్ బేఫికర్ జావ్" అన్నసుల్తానా మాటలు కర్ణపేయంగా వినిపించాయి తండ్రికి. హాయిగా నవ్వేడు ఖాన్, "ఠీక్ హై" అంటూ. కూతురు తెలివిగా తల్లికినచ్చ చెప్ప గలదని, ముస్లిమయినా, హిందువయినా, మంచి చెడు యిద్దరిలోనూ వుంటాయని విపులంగా చెప్పి, ఆమెకు ధైర్యం కలిగించగలదనే నమ్మకం అతని కుంది.

రెండు ఎప్పుడు కొడుతుందా అని గోడగడియారం వైపే చూస్తూ కూర్చున్నాడు.

..... ..... ..... ..... .....

"ఇగో—మళ్ల జెబ్తున్నాయాదయ్యా—నివ్వొక్కనివీ బోవద్దు. బస్తీలం దర్గల్నెల్లనివ్వి, ఆ తురుకోల్లు కసాయోల్లు, మన శతురివులాల్లు. జంపుదే ఆల్ల కిష్టం. ఈ పాతబస్తీల ఆల్లేమంది ఎక్కువగదాని ఆల్ల ధైర్నం" అంటూ గొంతు సాగతీస్తూ, కొడుకుని హెచ్చరిస్తూంది నర్సమ్మ.

"చత్ తియ్యి తురకోల్లంటే రాచ్చసులను కున్నావావేంటి? ఆల్లల్లోనూ మంచోల్లూ, సెడ్డోల్లూవుంటారు. మనోల్లు మాత్రం తక్కువ తిన్నారా? ఈల్లూజంపుతున్రి-తురకోదేంది, మనోదేంది—గూండా పోరగోల్లు జేత్తున్నారు గడబిడంతా. మనసుంటోల్లు ఆల్లకి బయపడి ఇండ్లనే

వుండి, పనిలేక, తింటానికి తిండిలేక జస్తుంటిమి. జర్రపైసలున్నా బయటకెళ్తేమంటే ఈ కర్ఫ్యూ ఓటి పేణాలుదీసేస్తాంది. ఈ రెండు గంటల్లోనే ఏటిదొరికితే గదీ కొనక్కుత్రా. మల్లెన్నాల్లుంటవో ఈ మాయదారిగొడవలూ, మాయదార్రి కర్ఫ్యూ. అసలు తురకోడా, ఇందూ వోడా అని సూడకుండా గూండానాకొడుకులందర్నీ చౌరాస్తాలో నిల బెట్టి, అందరు జూస్తుండగా పాణాలు దియ్యాలె దొంగ ఎదవలు.... దొంగ ఎదవలు—"

.... .... .... .... ....

రెండు గంటలయిన రెండు నిముషాల్లోనే పాతబస్తీ తిరునాళ్ల లాగా కళకళలాడసాగింది. జైళ్లలోంచి విడుదల అయినట్లు ఒకళ్లని చూసి ఒకళ్ల ధైర్యం తెచ్చుకుని వీధుల్లోకి వచ్చేసారు. క్షేమంగా వున్న స్నేహితుల్ని, బంధువుల్ని మతం మాట మరచిపోయి, పలకరించుకుంటు న్నారు. నష్టపోయిన వారిని పరామర్శిస్తున్నారు. వాళ్లదుఃఖంలో భాగం పంచుకుంటున్నారు. అల్లకల్లోలం సృష్టిస్తూన్న మత దురహంకారుల్నీ, గూండాలనీ ఇరుమతాల ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. నిత్యావసర వస్తువుల్ని కొనుక్కోవడానికి బజారుకి పరుగెడుతున్నారు. మళ్లీ ఈ రెండు గంటలూ దాటితే ఇళ్లలో బందీలమై పోతామేఅని బాధపడు తున్నారు. పైకి ధైర్యంగావున్నా, ఎవళ్లు తమ మీద దౌర్జన్యం చేస్తారో వనే భయం చాలామందికి లోలోన పీకుతూనేవుంది, గుండెలు చేత బట్టి తిరుగుతున్నారు. ముఖ్యంగా బజార్లు జనంతో కిటకిటలాడు తున్నాయి.

షాపుకార్లు యమబిజీగా వున్నారు-మూడు రోజుల తర్వాత షాపులు తెరుస్తున్నారు మరి.

తుపాకులు ధరించిన పోలీసులు రెప్పవాల్చకుండా గస్తీ తిరుగు తున్నారు. చౌరాస్తాలలో నిలబడి, నాలుగు దిక్కులకూ కళ్లు పొడు

యుకు చూస్తూన్నారు - కర్ఫ్యూ సడలించిన అవకాశాన్ని తీసుకుని ఇరు మూతాల వారూ మరింతగా కొట్టుకోవచ్చని.

చౌరాస్తాకి దగ్గర్లోవున్న పెద్ద దుకాణందగ్గర జనం విరగబడుతు న్నారు. బియ్యం, పప్పులు మాత్రమేకాదు. ఈరోజు కూరగాయలుకూడా తెచ్చి అమ్ముతున్నాడు ఆ శేట్. అవకాశం వినియోగించుకోదలచి.

"చావల్ కైసా దేరై భాయ్?"

"ఆఠ్ రూపయా కిలో"

"చావల్ - ఆర్ రూపయాకిలో?!!" ముక్కుమీదపడ్డ వేలుని దించలేకపోయాడు ఖాన్. కిలో బియ్యానికి ఎనిమిదిరూపాయలు పెడితే ఇంక బతికేదెలా?

"ఏంట - బియ్యం కిలో ఎనిమిది రూపాయలా?!!" యాదగిరి నోరు వెళ్లబెట్టాడు.

"ఏంది గట్ల నోరుతెరుస్తరు?! అవ్. బియ్యం కిలో ఎనిమిది రూపాయలే. కావాలంటే కొనాలె. లేకుంటే పోవాలె. అంతే" చీదరించు కున్నాడు శేట్.

"కందిపప్పెట్ల?"

"పదిరూపాయలు."

"అచ్ఛా - ఏ టమాటా కైసాదియె?" అడిగాడో సర్దార్జీ.

"చౌదహ్ రుపయే"

"పధ్నాలుగు రూపాయలా?!!"

"అవ్ - ఇనొస్తల్లేదా?"

"ఆలుగడ్డ?"

"పన్నెండు రూపాయలు."

— తెల్లబోయి చూస్తున్నారుజనం. అసలే ధరలుమండిపోతున్న రోజులివి. వచ్చే జీతాలకు మామూలు రోజుల్లోనే నాలుగు వేళ్లూ నోట్లోకి

పోవడం లేదు. ఇప్పుడింతింత ధరలైతే ఏం తినాలి? ఇదేం అన్యాయం? నెలజీతగాళ్లే టారెత్తిపోతూంటే మూడు రోజులుగా కూలిపనికూడా చేసు కునే అవకాశం లేని పేదవాళ్ల మాటేమిటి? వాళ్ల కళ్లలో కన్నీరు-కాదు రక్తం. ఎలా విలబడిపోయారో వాళ్లు! కాదు- శిలా ప్రతిమల్లా బిగుసుకు పోయారు!.

"అన్యాయం శేఠ్- ఇంతింత ధరలా?"

"అరె! ఇష్టమయితే కొను. లేకుంటే లే గాడ్నుంచి. ఇంట్ల పండుకో పో. లొల్లి జేయకు. గీ రొండు గంటలు పోతె మట్టి దినాలె. యాదుంచుకో." కసిరాడు శేఠ్. అతనిది పై చేయి మరి.

"ఇప్పుడు మనం ఇక్కడ ధర లెక్కువని, వేరే చోట తక్కువ ఉంటాయనుకుని బజారంతా తిరిగే సరికి రెండు గంటలూ అయిపోతాయి ఉత్తిచేతులతో తిరిగివెళ్లాలి. పిల్లలుమాడిచస్తారు" అంటూ ఒక నడివయ స్సావిడ వందరూపాయల నోటు శేఠ్‌జీకి అందించి, చేతిసంచీలో కావ లసిన సరుకులు వేయించుకుంది. మరికొందరు హడావుడిగా ఆమె పద్ధతినే అనుసరించారు, పరిస్థితిని అర్థం చేసుకున్నవారై, బాధని గుండెల్లోనే సమాధి చేసి అంతా హడావుడి, కంగారు, పెరిగినధరలు, రెండు గంటలే వ్యవధి, గొడవలు, కర్ఫ్యూ.... ఎవ్వరికీ మనశ్శాంతిలేదు.

అంతలో ఒక్కసారిగా పెద్ద అలజడి, తొక్కిసలాట, అరు పులు, ఏడుపులు. భయపడ్డ జనం ఖాళీ కనపడ్డ వైపు గుండెలు చేత పట్టుకుని పరుగెత్తారు

"తురకోళ్లు చంపుతున్రు" అంటూ ఏడుస్తూ పరుగెత్తుతున్నాడొక హిందూ అబ్బాయి.

"బచావ్ భాయీ, బచావ్" అంటూ ఒక ముస్లిం యువతి పోలీసుల దగ్గరకు పరుగెత్తింది.

క్షణాల్లో పోలీసులు- అలజడిరేగిన ప్రదేశానికి హుటాహుటిన

చేరుకున్నారు. గుంపుని చెల్లాచెదురు చేస్తూ, కేంద్రస్థానాన్ని చేరిన పోలీసులు విస్తుపోయి బొమ్మల్లా నిలబడిపోయారు. మరోనిముషానికి తేరుకుని, మెరుపులా ముందుకురికి, పిడికిలి ఎత్తిన రెండు చేతుల్ని పట్టుకున్నారు, ఒక చేయి ముస్లిమ్‌ది, మరోచేయి హిందూది. వాళ్ల రూపాలు, వస్త్రధారణ వాళ్ళ మతస్థులో చాటుతున్నాయి.

వింతేమిటంటే- వాళ్లు ఒకళ్లనొకళ్లు పొడుచుకో బోవడం లేదు. ఇద్దరిగురీ ఒకే వ్యక్తిమీదవుంది. ఆవ్యక్తి- వాళ్ల చేతుల్లో ఇరుక్కున్న శేఠ్‌జీ.

"ముఝె నక్కో రోకో అమీన్‌సాబ్– ఏ శేఠ్‌కు....ఏకుత్తేకు.... మార్నేదో...." అరిచాడు ముస్లిం, విడిపించుకుంటూ.

"ఈ లమ్డీకొడుకుని కుళ్లబొడిచిన తర్వాత నన్ను అరెస్టుచేయండి ఇన్‌స్పెక్టర్. ఆపకండినన్ను. ఈ శేఠ్‌గాడు మనిషికాదు...రాక్షసుడు.." పళ్లుపటపట లాడించేడు హిందూ ఎర్రబడ్డ ముఖంతో.

విస్తుపోయి చూస్తున్నాడు ఇన్‌స్పెక్టర్.

"వదలకున్రి అమీన్ సాబ్– తీస్కపోన్రి. లేకేజావ్ ఏ గూండోంకూ– నక్కో ఛొడో. దొంగ ముండాకొడుకులు. వదిలితే నా ప్రాణం దీస్తరు. నివ్వు అరెస్టు జెయ్యలేదని నీ నౌకరీపూడ్తది. అరెస్టు జేయించు.... జల్దీ...." అంటూ కీచుమన్నాడు శేఠ్, భయంతో వణికిపోతూ.

"అరెస్ట్ దెమ్!"

ఇన్‌స్పెక్టర్ ఆజ్ఞ నందుకుని వాళ్లిద్దరి చేతులకీ బేడీలు తగిలించి. లాక్కుపోయారు పోలీసులు.

"దొంగముండా కొడుకులు.... గూండాగాళ్లు...." అని తిట్టుకుంటూ, మీసంమెలేసి, కోట్లోకి ఎక్కాడు శేఠ్, వాచీ చూసుకుంటూ. రెండు గంటల్లో ఒక గంట అప్పుడే గడిచిపోయింది. ఇంక గంటే

వుంది. కంగారు, హుషారు ఒకసారే పేట్రేగాయి అతగాడిలో. గంటలో సరుకంతా అమ్మాలి. మళ్లీ ఎన్నాళ్లో కర్ఫ్యూ.

మళ్లీ జనం మూగారు శేఠ్ దుకాణం దగ్గర—కొనుక్కోవడానికి.

"శేఠ్—బియ్యం కిలో ఎంత?"

"పదిరూపాయలు"

"పదా?! ఇందాక ఎనిమిదన్నావుకదా?!!"

"ఛత్‌తియ్యి—ఇష్టమయితే కొను. లేకుంటే వద్దు" చీదరించాడు.

"టమాట ఎట్ల?"

"పదహారురూపాయలు కిలో"

అదీ రెండు రూపాయలు పెరిగింది ఇంతలోనే.

చలన రహితులై చూస్తున్నారు అనేకులు. కొందరు మాత్రం గుడ్లనీళ్లు కుక్కుకుంటూ, వాడు నోటికొచ్చినట్లు చెపుతూన్న ధరలకు కొనుక్కుంటూన్నారు. తూకంలో కూడా సగానికి సగం మోసం.

"కర్ఫ్యూ వుంటేనే మంచిగున్నట్లుంది. ఇంట్లనే వుండి ఏడుస్తుంటిమి. గిప్పుడు గింతంత ధరలు పెట్టి ఏమికొనాలె? రెండు గంటలు కర్ఫ్యూ తీసేసింది గీ షాపులోల్ల బాగుకోసమన్నట్లుందిగానీ, గరీబోల్ల కోసం గాదు" అంటూ గొణిగాడు యాదయ్య, పక్కనున్న బషీర్‌తో,

"హా భాయ్. తుమ్ ఠీక్ కహా. గరీబోంకే వాస్తే నహీ. హమ్ ఘర్ మె రహేతోభీ ఏకీచ్ హై, బాజార్‌కు ఆయేతో భీ ఏకీచ్ హై" అన్నాడు బషీర్, రుద్ధమయిన గొంతుతో.

"గిదే మన్యాయమని అడిగిన పిల్లగోల్లని పోలీసులు పట్కపోయిరి. గీ శేఠ్ ధరలు ఇంకా ఎక్కువ జేసి అమ్ముతాండు. ఏం జెప్పాలె? కలికాలం.........."

ఆ ఇద్దరితో వ్యాన్ ఎక్కిన ఇన్‌స్పెక్టర్ కూడా తను ఘనకార్యం చేసేశాననుకోవడం లేదు. లోలోనే బాధ పడుతూ, 'బ్రదర్స్-

నన్నుక్షమించండి. నా డ్యూటీ నేనునెరవేరుస్తున్నానంతే. దౌర్జన్యం, దోపిడీ జరగకుండా కనిపెట్టుకుని ఉండమని నాకు ఆర్డర్లున్నాయిగాని, ఈ శేఠ్ బాహాటంగా చేస్తూన్న దౌర్జన్యాన్నీ, దోపిడీని ఆపేందుకు నాకు పవర్ లేదు. ఈ శేఠ్ ఒక్కడేకాదు—కర్ఫ్యూ సడలించిన అన్ని ప్రాంతాల్లోనూ ఈ రెండు గంటల్లోనూ వర్తకులు చాలామంది ప్రజల రక్తాన్ని తనివితీరా తాగుతారు. వీళ్లలో హిందువులూ వున్నారు, ముస్లిములూవున్నారు. వాళ్లు భేదభావం చూపించకుండా ఇరుమతాలవారి రక్తాన్ని సమంగా తాగుతారు. ఈ రెండు గంటల్లో హిందూ ముస్లిములు కత్తులతో పొడుచుకు చావడంలేదు—ఇలాంటి శేఠ్‌లు ధరలతో కుళ్లబొడిచి చంపుతున్నారు. ఈ దుర్మార్గుల్ని శిక్షించి, ప్రజల్ని కాపాడే రక్షకభటులెవరో మరి?!' అనుకుంటూ తలవంచుకుని, కళ్లలో వూరిన రెండు నీటి బొట్లని బయటకు జారకుండా రెండు వేళ్లతో అదిమిపట్టుకున్నాడు.

మరో అరగంటకి ఆ ఇద్దరి యువకులకోసం కటకటాల తలుపులు తెరుచుకున్నాయి.

అదే సమయంలో రూపాయి నోట్లతో కిక్కిరిసి, ఉక్కిరి బిక్కిరి అవుతున్న శేఠ్ కొట్లోని ఇనప్పెట్టితలుపులూ మూసుకున్నాయి.

ఆంధ్రపత్రిక—2-12-81